ప్రజాశక్తి
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025
5
అనంతపురం

కార్పొరేషన్ వద్ద ఆందోళన చేస్తూ అక్రమ కేసుపై అధికారిని నిలదీస్తున్న సిఐటియు నాయకులు

30 ఏళ్లుగా పని చేస్తున్న..

కార్మికునిపై కేసులా..?

కార్పొరేషన్ అధికారుల తీరుపై సిఐటియు ఆగ్రహం

కనీస సమాచారం ఇవ్వరా : కమిషనర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో కార్మికుడు (వర్కర్ కం ఫిట్టర్) గౌరీ శంకర్‌పై బుధవారం నాడు కొందరు అధికారులు పోలీసు కేసు పెట్టిన వ్యవహారం తీవ్ర దుమారం రేపింది. 30 ఏళ్లుగా కార్పొరేషన్ పరిధిలో కార్మికుడిగా పనులు చేస్తున్న అతని సేవలను గుర్తించకుండా ఏకంగా పోలీసు కేసు వరకు కొందరు అధికారులు వెళ్లిన తీరును పలువురు తప్పుబట్టారు. కార్మికునికి మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నాడు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సిఐటియు అనుబంధ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజశేఖర్ గది వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు గోపాల్, నాగభూషణం, ముర్తుజా, ఏటీఎం నాగరాజు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో పైపులు దొంగతనం చేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న వారిని వదిలేసి 30 ఏళ్లుగా కష్టపడి పని చేస్తున్న కార్మికునిపై కేసు పెట్టడం ఏమిటంటూ ఎస్ఇని నిలదీశారు. పైపులైన్ మరమ్మతుల సమయంలో ప్లాంజులను ఎత్తుకెళ్లిన ట్యాప్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషాపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పైప్‌లైన్ మరమ్మతు పనులు ఆలస్యం కావటానికి కారణం ట్యాప్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషా అన్నారు. ముందు ఆయన్ను సస్పెండ్ చేయాలన్నారు. నిత్యం కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న మహబూబ్ బాషాను వాటర్‌వర్క్స్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

కమిషనర్ ఛాంబర్ వద్ద ఆందోళన

కమిషనర్ బాలస్వామి తన ఛాంబర్ వద్దకు రాగానే సిఐటియు నాయకులు అక్కడికెళ్లి ఆందోళన కొనసాగించారు. పైపులైన్ మరమ్మతు పనులు జాప్యం కావటానికి కారణమైన ట్యాప్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషాపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని, వర్కర్ గౌరీ శంకర్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలన్న ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికునికి న్యాయం చేసి, ట్యాప్ ఇన్స్‌పెక్టర్‌పై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని సిఐటియు నాయకులు స్పష్టం చేశారు.

అధికారులపై కమిషనర్ ఆగ్రహం

కార్మికులు తప్పు చేస్తే వారిని విచారించి, మందలించాలే కానీ ఉద్యోగం నుంచి తొలగించే నిర్ణయం సరికాదంటూ కమిషనర్ బాలస్వామి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికునిపై చర్యలు, పోలీసు కేసు విషయాలు తన దృష్టికి తీసుకురాకుండా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్ తీసుకున్న నిర్ణయాలను తప్పుపట్టారు. తన సంతకం లేకుండా పోలీస్ కేసు ఎలా పెడతారన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 ఏళ్ల సర్వీస్ చేసి, ఏడాదిలో ఉద్యోగ విరమణ చేస్తున్న కార్మికునిపై వ్యవహరించిన తీరు సరికాదన్నారు. అధికారులుగా ఉంటూ కార్పొరేషన్ ప్రతిష్టకు భంగం కలిగించే నిర్ణయాలు చేయడం మంచిది కాదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌ను మందలించారు. ట్యాప్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషా అవినీతి అక్రమాలపై విచారణ చేసి వాస్తవాలు తనకు నివేదిక ఇవ్వాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ అహ్మద్‌ను ఆదేశించారు. పైపులైన్‌ల మరమ్మతుల్లో ఆలస్యం, ప్లాంజుల దొంగతనం, కార్మికులపై తప్పుడు ఫిర్యాదులు చేసిన అంశాలపైనా విచారణ చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. విచారణ అనంతరం ట్యాప్ ఇన్స్‌పెక్టర్‌పై చర్యలు చేపడతామని, కార్మికునికి ఎలాంటి అన్యాయం చేయమని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ హామీతో సిఐటియు నాయకులు ఆందోళన విరమించారు.

ప్లాంజుల దొంగతనం విచారణ అటకెక్కినట్లేనా.?

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కలెక్టరేట్ వెనుక భాగం వాటర్ ట్యాంక్ పైప్‌లైన్ మరమ్మతు సందర్భంగా ప్లాంజుల చోరీ దొంగలపై చర్యల వ్యవహారాన్ని ఇంజినీరింగ్ అధికారులు అటకెక్కించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దొంగతనం చేసిన వారిని శిక్షించకుండా 30 ఏళ్లుగా కార్పొరేషన్ పరిధిలో కార్మికుడిగా(వర్కర్ కం ఫిట్టర్)గా విధులు నిర్వహిస్తున్న గౌరీశంకర్‌ను ఆగమేఘాలపై తొలగింపు చర్యలకు ఉత్తర్వులు సిద్ధం చేయడం కార్పొరేషన్ ఉన్నతాధికారులను సైతం విస్మయానికి గురి చేస్తోంది. దొంగతనం వ్యవహారం అటకెక్కించడం, కార్మికునిపై చర్యల వ్యవహారం మధ్య తెరచాటున ఓ వ్యక్తి మంత్రాంగం నడిపినట్లు తెలుస్తోంది. ఆ వ్యక్తి మాటను ఇంజినీరింగ్ విభాగాధిపతి అమలు చేయాలని చూడడం ఆ శాఖ సిబ్బందిలో సైతం చర్చనీయాంశంగా మారింది. వాటర్ వర్క్స్ విభాగంలో వివాదాస్పదుడుగా మారి పలు సందర్భాల్లో వర్కర్లపై దురుసుగా వ్యవహరించారంటూ ట్యాప్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషాపై ఆరోపణలున్నాయి. విభాగాధిపతికి అవసరమైన అన్ని వసతులనూ సమకూరుస్తూ ఉండటంతోనే అతని మాటకు ఎదురులేదనే భావన ఉంది. అనంతపురం నగరంలో పరిధిలోని ఆర్ఎంహెచ్ హైస్కూల్ వాటర్ ట్యాంక్‌లో పైపులైన్ మరమ్మతు సందర్భంగా సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో తెచ్చిన వాల్వుతోపాటు వెల్డర్ తీసుకువచ్చిన రూ.5వేల విలువజేసే రెండు ప్లాంజులను ఓ ఉద్యోగి అక్రమంగా తరలించడంతోనే మరమ్మతు పనులు నిలిచిపోయాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్లాంజులను తీసుకెళ్లిన వారు వాటిని అప్పగించకుంటే సీసీ ఫుటేజ్ ద్వారా పరిశీలించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని వెల్డర్ జిలాన్ స్పష్టం చేయటంతో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో వాటిని తీసుకెళ్లిన వాటర్ వర్క్స్ సిబ్బంది ఒకరు వెనక్కు తీసుకువచ్చి అప్పగించినట్లు సమాచారం. ప్లాంజులను తీసుకెళ్లిన వ్యక్తి ఎవరన్నది సూపరిండెంట్ ఇంజినీర్ రాజశేఖర్‌కు తెలిసినా చర్యలు చేపట్టడంలో ఉదాసీన వైఖరి అవలంభించడంపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇదే సమయంలో ఏ తప్పు చేయని ఫిట్టర్ గౌరీ శంకర్‌పై పోలీస్ కేసు పెట్టడంతో పాటు ఉద్యోగం నుంచి తొలగించడానికి ఎస్ఇ ఉత్తర్వు పత్రాలు తయారు చేసి సంతకాలు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఉద్యోగులపై దాడులు జరిగిన సమయంలో వారికి అండగా కార్మికులు నిలుస్తున్నారు. అలాంటి కార్మికులపై కేసులు పెట్టడం ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. అక్రమాలు చేసిన వ్యక్తి కళ్లెదుటే కన్పిస్తున్నా సంబంధిత ఉన్నతాధికారి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్న ప్రశ్న ఉద్యోగ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారి వివాదాస్పదుడైన ఆ ఉద్యోగి కల్పించే వసతులకు దూరంగా ఉండి విధులు నిర్వహిస్తే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

పరిహారం కోసం ఎదురుచూపు..!



◆ 2024 నుంచి ఇప్పటి వరకు నిధుల విడుదల్లేదు

◆ పంటనష్టపోయిన అన్నదాతకు సాయం కరువు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రకృతి వైపరీత్యంతో దెబ్బతింటున్న పంటకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గతేడాది ఖరీఫ్‌లో అంటే 2024 ఖరీఫ్‌కు సంబంధించి జరిగిన పంటనష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పటికీ అందలేదు. అధిక వర్షాలు కూడా గతేడాది వచ్చాయి. వీటి వల్ల ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది మార్చిలో అకాల వర్షాలతోనూ పంటలు దెబ్బతిన్నాయి. ఒకవైపు వర్షాభావం, మరోవైపు అధిక వర్షాలు రెండింటి వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ కూడా ముగింపునకు వచ్చింది. ఈ సమయంలోనైనా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అనంతపురం జిల్లాలో బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, రాప్తాడు, విడపనకల్లు, యాడికి, అనంతపురం, నార్పల ఏడు మండలాల్లో వర్షాభావం నెలకొంది. ఈ మండలాలను కరువు మండలాలుగానూ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 12,678 మంది రైతులకు సంబంధించి 12,856 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. రూ.19.98 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సత్యసాయి జిల్లాలో 46,836 మంది రైతులకు రూ.62.46 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉంది. అక్టోబర్‌లో అధిక వర్షాల వల్ల అనంతపురం జిల్లాలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. వీటికి సంబంధించి రూ.15 లక్షల వరకు పరిహారం రావాల్సి ఉంది. సత్యసాయి జిల్లాలో రూ.49.11 లక్షలు పరిహారం రావాలి. 2024 నవంబర్, డిసెంబర్, ఈ ఏడాది మార్చి నెలల్లోనూ అధిక వర్షాలతో రైతులు పండించిన పంటలు దెబ్బతిన్నాయి. వీటికి సంబంధించి నష్టపరిహారాన్ని అధికారులు అంచనావేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటి వరకు రైతులకు పరిహారం మంజూరువలేదు. ఎప్పుడు విడుదలవుతాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. 2025 ఖరీఫ్ కూడా పూర్తికావొచ్చింది. ఈ ఏడాది వర్షాభావం, అధిక వర్షాలు రెండింటి మూలంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది పంటనష్టానికి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ అయినా మంజూరు చేస్తే కొంత ఊరట లభించే అవకాశం ఉంటుంది. సీజన్ ప్రారంభంలో ఈ ఏడాది వర్షాభావంతో పంటల సాగు కూడా ఆశించినంత జరగలేదు. ప్రధాన పంట అయిన వేరుశనగ మరింత తక్కువగా ఈ ఏడాది సాగైంది.

ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలి

ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని తక్షణం విడుదల చేయాలి. గతేడాది పంటనష్టం జరిగితే ఇప్పటి వరకు ఇవ్వలేదు. గతేడాది కరువు మండలాల ప్రకటన చేసినా ఏడు మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించారు. అందులోనూ పరిహారం ఇవ్వకుండా జాప్యం సరైంది కాదు. అది కాకుండా అక్టోబర్, ఈ ఏడాది మార్చి నెల్లో అకాల వర్షాల వలన కూడా రైతులు పంటలు నష్టపోయారు. వాటికి తగినంత సహాయం అందించి ఆదుకోవాలి. తక్షణం ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసి జిల్లా రైతులను ఆదుకోవాలి.

చంద్రశేఖర్‌రెడ్డి,
ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నవంబర్‌లో రెవెన్యూ క్రీడా ఉత్సవాలు

బ్రోచర్ విడుదల చేసిన కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి ఆధ్వర్యంలో నవంబర్ 7,8,9వ తేదిల్లో అనంత ఆర్‌డిటి మైదానంలో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఉమ్మడి జిల్లా నేతలతో కలిసి కలెక్టర్ గురువారం స్థానిక కలెక్టరేట్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒత్తిళ్లకు గురయ్యే ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే వారికి లాటరీ విధానంలో డ్రెస్ కోడ్ ఎంపిక చేశామన్నారు. 26 జిల్లాలు, సిసిఎల్ఎ కార్యాలయం మొత్తంగా 27 యూనిట్ల నుంచి పాల్గొనే కంటింజెంట్లకు సంబంధించిన డ్రెస్ కోడ్ రంగులను లాటరీ పద్ధతిలో నిర్ణయించి ప్రకటించారు. ఉద్యోగులు ఈ క్రీడా ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.సోమశేఖర్, అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారి మలోలా, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ జి.రామకృష్ణ రెడ్డి, అనంతపురం ఆర్‌డిఓ కేశవ నాయుడు, జిజిహెచ్ ఏవో మల్లికార్జున రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున, తిప్పే నాయక్ పాల్గొన్నారు.

నానో యూరియా వాడి

దిగుబడి పెంచుదాం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-యల్లనూరు

యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా వాడి దిగుబడి పెంచుదామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ పిలుపునిచ్చారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మలత ఆధ్వర్యంలో గురువారం పైలెట్ ప్రాజెక్టు మండల పరిధిలోని పిఎం కొండాపురం గ్రామ సమీపంలో 25 ఎకరాల మొక్కజొన్న పంటలో డ్రోన్ సాయంతో నానో యూరియా పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల చాలా నష్టాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా భూమిలో సారవంతం తగ్గి పంట దిగుబడి ఆశాజనకంగా ఉండదన్నారు. అంతేగాకుండా పంటకు వైరస్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రస్తుతం అరటి, మొక్క జొన్న, చీనీచెట్లకు వాడటం వల్ల చెట్లులో కొమ్మలు ఎండి పోతున్నాయన్నారు. కావున యూరియా వాడకం తగ్గించి కెమికల్ లేని నానో యూరియా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్ శంకర్ ఎడిఎ ఎం.రవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలియజేశారు. గురువారం ఉదయం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ గ్రామ సచివాలయం వద్ద ఏక్ దిన్.. ఏక్ ఘంట.. ఏక్ సాథ్ (ఒకరోజు. ఒక గంట.. అందరూ కలిసి..) అనేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని శంకర్, సీఈఓ శివశంకర్, డీపీవో నాగరాజు నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సురేష్, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేసి చెత్తను ఏరవేశారు. వైద్య శిబిరం, సంపూర్ణ పోషన్ అభియాన్ కింద పౌష్టికాహార మాసోత్సవాల స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు ఒక గంట, కొంత సమయం ఇంట, బయట కూడా శుభ్రం చేసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలియజేశారు. అనంతరం పర్యావరణహిత బట్ట బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తేజస్విని, రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవి, తహశీల్దార్ మోహన్ కుమార్, ఎంపీడీవో దివాకర్, ఆర్ఐ సందీప్, పంచాయతీ సెక్రెటరీ ఇదయతుల్లా, రెడ్ సంస్థ భానుజా పాల్గొన్నారు.

సచివాలయం వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్

ప్రమాదకరమైన బ్రిడ్జిపై వెళ్తున్న విద్యార్థులు

ఆదమరిస్తే అంతే..!

పుట్లూరులో ప్రమాదకరంగా బ్రిడ్జిలు-ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-పుట్లూరు

ఆదమరిచి ఆ బ్రిడ్జిపై వెళ్లా.. అంతే సంగతులు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన ప్రమాదం తప్పదు. పుట్లూరు మండల కేంద్రంలోని హెచ్ఎల్‌సి కాలువలపై ఏర్పాటు చేసిన రెండు బ్రిడ్జిలకు ఇరువైపులా ఉండే రక్షణ గోడలు కూలిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఆయా బ్రిడ్జిలపై ప్రయాణమంటే వాహనదారులు, ప్రజలు భాయందోళన చెందుతున్నారు. గతంలో నాయకునిపల్లికి వెళ్లే రహదారిలో వెళ్తూ ప్రమాదవశాత్తు బ్రిడ్జిపై నుంచి కాలువలో పడి వ్యక్తి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మండల కేంద్రంలో ఉన్న మరో బ్రిడ్జిపై వెళ్లేందుకు విద్యార్థులు అధికారులు, ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా కస్తూరిబా బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలకు వెళ్లే విద్యార్థులతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ప్రజలు ఈ బ్రిడ్జిపై నుంచే వెళ్లాల్సి ఉంది. దీంతో ఎప్పుడే జరుగుతుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉద్యోగులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితో ఈ బ్రిడ్జిలపై వెళ్తూ ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల ప్రమాదాలు చోటు చేసుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువపై ఏర్పాటు చేసిన బ్రిడ్జికి ఇరువైపులా సైడ్‌వాల్ ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పరిశోధనలతో వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.విజయశ్రీ

ప్రజాశక్తి-అనంతపురం

మెడికల్ కళాశాల మైక్రోబయాలజీ విభాగంలోని వైరల్ రీసెర్చ్ డయాగ్నోస్టిక్ లేబరేటరీ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు పోలిమరైజ్ చైన్ రియాక్షన్, ఎలిసా పరీక్షలపై గురువారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎం.విజయశ్రీ మాట్లాడుతూ పరిశోధనలతోనే వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయన్నారు. నూతన ఆవిష్కరణలకు నాంది పలకవచ్చన్నారు. అందుకే పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు పరిశోధనాత్మకంగా, ప్రశ్నాత్మకంగా, మన విద్య సమాజానికి ఏ విధంగా మేలు చేయగలదన్నారు. వైద్య ఉపాధ్యాయ సిబ్బంది అంతా ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలిపారు. 48 మంది వివిధ విభాగాల పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు కో ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ సరోజ, నాన్ మెడికల్ సైంటిస్ట్ అనురాధ, రీసెర్చ్ అసిస్టెంట్ సాయి గీత, సీనియర్ టెక్నీషియన్లు చైతన్య, రాజశేఖర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ సరిత తదితరులు పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు ఎలిశా, పిసిఆర్ పరీక్షలపై హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, మైక్రో బయాలజీ ఇన్‌ఛార్జి హెచ్‌ఒడి ఆర్.హైమావతి, వైద్యులు సరోజ, శైలజ, ఉమాదేవి, ప్రవీణ, ప్రియాంక, లలిత భవాని, దివ్య, కృష్ణవేణి, సీనియర్ రెసిడెంట్ ఎల్లం నాయుడు, ట్యూటర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, మైక్రో బయాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న విజయశ్రీ

చిన్నారి మృతిపై ఎమ్మెల్యే సీరియస్

చర్యలకు ఆదేశాలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని కొర్రపాడు వద్ద ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏడాదిన్నర చిన్నారి ఆడుకుంటూ వేడి పాలపాత్రలోకి పడి మృతిచెందిన ఘటనపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సేవా సుప్రీం ఏజెన్సీ కింద పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న కృష్ణవేణి కుమార్తె 17 నెలల అక్షిత ఆడుకుంటూ కిచెన్‌లోకి వెళ్లింది. ఆడుకుంటూ విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన వేడిపాలను చల్లార్చడం కోసం ఉంచిన పాలల్లోకి పడింది. చిన్నారి అరుపులను గమనించి బయటకు తీసిన తల్లి వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందిన విషయం తెలిసిందే. మొత్తం ఘటన సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వంటశాల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఇంటర్నల్ హ్యాకథాన్'తో కొత్త ఆవిష్కరణలు

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పి.చెన్నారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్-2025తో విద్యార్థుల ప్రతిభను దేశానికి పరిచయం చేయడమే కాకుండా కొత్త ఆవిష్కరణలకు దారితీస్తుందని ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్-2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విభిన్న విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సాంకేతిక ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు వాస్తవ సమస్యలకు వినూత్న పరిష్కారాలను ప్రాజెక్టుల రూపంలో చూపించారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ మొదలైన విభాగాల నుండి వచ్చిన బృందాలు తమ ప్రతిభను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వంటి జాతీయస్థాయి కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనడం గర్వకారణమన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను సాంకేతిక పరిజ్ఞానంతో మిళితం చేసి సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలను అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి జి.మమత, సంచాలకులు ఇ.కేశవరెడ్డి, పి.రమణారెడ్డి, ఆర్.రాజశేఖర్, బి.లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

తొలగించిన కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలి

గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ కార్యదర్శి శివప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రుద్రంపేట గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న కార్మికుడు వెంకటరాముడుని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయం ఏఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల స్థానిక టిడిపి నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మానవీయ దృక్పథంతో కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలని సదరు నేతలకు, పంచాయతీ కార్యదర్శికి సూచించినప్పటికీ విధుల్లోకి తీసుకోకపోవడం అన్యాయంగా ఉందన్నారు. కార్మికుడిని విధుల్లోకి తీసుకునేంత వరకు కార్మికులంతా ఐక్యమత్యంతో పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు నూర్‌బాషా, చంద్ర, మూర్తి, శివయ్య, పెద్దన్న, లింగమయ్య, పెద్దక్క, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

టమోటా రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి హెచ్ రాయుడు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం స్పందించి టమోటా రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కళ్యాణదుర్గం-ధర్మవరం రోడ్డు వద్ద ఉన్న టమోటా మండీల్లో రైతుసంఘం నాయకులు పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకోవడంతోపాటు టమోటా ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్న మిర్చి, చీనీ, అరటి, పొగాకు, మామిడి రైతులు, నిన్న బొప్పాయి, ఉల్లి రైతులు, నేడు టమోటా రైతులు గిట్టుబాటు ధరల్లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు, ఎరువులు క్రిమి సంహారక మందుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఈనేపథ్యంలో ఏ పంటకు చూసినా గిట్టుబాటు ధర లేకుండా పోయిందన్నారు. ఉమ్మడి జిల్లాలో టమోటా సుమారు 30వేల ఎకరాల్లో సాగైందన్నారు. ఎకరాకు రూ.60 నుంచి రూ.70వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. ఈనేపథ్యంలో ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో కనీసం పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఆఖరికి కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి తక్షణం మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో కిలో రూ.25 కనీస మద్దతు ధరతో టమోటా పంటను కొనుగోలు చేయాలన్నారు. అలాగే జిల్లాలో ప్రభుత్వమే టమోటా మార్కెట్ ఏర్పాటు చేసే ప్రతి నియోజకవర్గానికి కోల్డ్ స్టోరేజ్, జ్యూస్ పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు.

టమోటా పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం నేతలు

రేపటి నుంచి డిగ్రీ అడ్మిషన్లు

అనంతపురం : నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం నుంచి రెండవ దశ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 29వతేదీ నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు వెబ్ ఆప్షన్ ఎంపిక ఉంటుందన్నారు. కళాశాలలో ఆర్కియాలజీ, హిస్టరీ, స్టాటిస్టిక్స్, ఆర్గనిక్, క్రియేటివ్ రైటింగ్, డేటా సైన్స్, మార్కెటింగ్, సేల్స్, బయో ఇన్ఫర్మేటిక్స్, ఆర్గానిక్ ఫార్మింగ్, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, తెలుగు, మ్యాథమెటిక్స్, అనిమల్ బయోటెక్నాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వంటి విభాగాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

అనంతపురం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గంలోని వివేకానంద కళాశాల, చిక్కప్ప గవర్నమెంట్ జూనియర్ కళాశాలల్లో గురువారం సైబర్ నేరాలు-అవగాహనపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా 'సురక్ష' ఎల్ఈడీ డిస్‌ప్లే బోర్డ్ వాహనం ప్రొజెక్టర్ ద్వారా వీడియోలతో వివరించారు. అలాగే గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాల్య వివాహాలు, సైబర్‌నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, గంజాయి, మాదక ద్రవ్యాలు, అనర్థాలపై అవగాహన కల్పించారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లకు అక్టోబర్ 31 వరకు అవకాశం

అనంతపురం సిటీ : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఎపిఒఎస్-ఎస్) ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ, ఇంటర్ తరగతుల్లో ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందడానికి రూ.200 అపరాధ రుసుంతో అక్టోబర్ 31వతేదీ వరకూ గడువు పొడిగించనట్లు డిఇఒ ఎం.ప్రసాద్‌బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జెఎన్‌టియులో నూతన భవనం ప్రారంభం

అనంతపురం : జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ నూతన భవనాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం విసి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ఎంబిఎ విభాగాధిపతి బి.చంద్రమోహన్‌రెడ్డి, ఎగ్జామినేషన్ డైరెక్టర్ నాగప్రసాద్‌నాయుడు, కంట్రోలర్, అసిస్టెంట్ కంట్రోలర్, యూనివర్సిటీ వివిధ విభాగాల డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక రైలు

రాయదుర్గం : దసరా పండుగను పురస్కరించుకుని నైరుతి రైల్వే బెంగళూరు నుండి రాయదుర్గం మీదుగా హొస్పేటకు ప్రత్యేక రైలు సర్వీస్ నడపనున్నట్లు నైరుతి రైల్వే గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ట్రైన్ నెంబర్ 06215 ప్రత్యేక రైలు ఈనెల 26, 28వతేదీల్లో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య బెంగళూరు స్టేషన్ నుంచి సాయంత్రం ఏడు గంటలకు బయలుదేరి తుమకూరు, అరసికెరే, బీరూరు, చిక్కజాజూరు, చిత్రదుర్గ మీదుగా రాయదుర్గంకు అర్ధరాత్రి 1:38 గంటలకు చేరుతుంది. అక్కడి నుండి బయలుదేరి బళ్లారి కంటోన్మెంట్, తోరనగల్ మీదుగా హొసపేటకు మరుసటి రోజు తెల్లవారి జామున 4:15 కు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

బ్రహ్మసముద్రం ఎంపిడిఒగా ఉమాదేవి

బ్రహ్మసముద్రం : మండల ఎంపిడిఒగా ఉమాదేవి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పని చేస్తున్న రంగనాయకులును బ్రహ్మసముద్రం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఆయన స్థానంలో జిల్లా ప్రజా పరిషత్‌లో పరిపాలన అధికారిణిగా పని చేస్తున్న ఉద్యోగోన్నతిపై ఎంపిడిఒగా నియమించారు. దీంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. అంతేగాకుండా మండల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. అనంతరం ఉద్యోగులు ఎంపిడిఒను సత్కరించారు.

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

బ్రహ్మసముద్రం : ఆర్‌డిటి సంస్థ ఎఫ్‌ఆర్‌సిఎను పునరుద్ధరించాలని సంతేకొండాపురం గ్రామస్తులు కోరారు. ఈమేరకు గురువారం స్థానిక సర్పంచు మల్లెల వనితా మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఉపాధ్యాయులు జయరాజు, మల్లికార్జున, కృష్ణమూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

వినియోగదారులతో సఖ్యతగా మెలగాలి : ఆర్డీవో

కళ్యాణదుర్గం టౌన్ : చౌకదాన్య డిపోల డీలర్లు వినియోగదారులతో సక్యతగా మెలగాలని ఆర్డీవో వసంతబాబు సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డీలర్లకు ఈపాస్ మిషన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల కోసం వచ్చే లబ్ధిదారులను గౌరవంగా పలకరించాలన్నారు. 60ఏళ్ల పైబడిన వృద్ధుల ఇంటివద్దకే సరుకులు సరఫరా చేయాలన్నారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాస్కర్, సిఎస్‌డిటి దుర్గాప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ అహమ్మద్, డీలర్లు పాల్గొన్నారు.

6, 7 వార్డుల్లో 'మోసం గ్యారెంటీ'

రాయదుర్గం : పట్టణంలోని 6, 7వ ఎన్నికల వార్డుల్లో గురువారం వైసిపి ఆధ్వర్యంలో బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాలు శిల్ప, వార్డు సభ్యులు గోవిందరాజులు, శివకుమార్, శారద, సంజీవప్ప, మంజునాథ, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ ఆరవ శివప్ప, పార్టీ నాయకులు, రఘురాం, రామాంజనేయులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చదువుతోపాటు మానసిక సామర్థ్యాలు అవసరం

గుత్తి : విద్యార్థులు చదువుతోపాటు శారీరక, మానసిక సామర్థ్యాలను పెంపొందించుకోవాలని వక్తలు సూచించారు. గురువారం స్థానిక గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్, ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్వ్యూ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ప్రపంచంలో జరుగు నూతన ఆవిష్కరణలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్,ఎఓ ఇంతియాజ్, హెచ్‌ఓడి హరిప్రియ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE IST ADDL.JUNIOR CIVIL JUDGE: ANANTHAPURAMU
O.S. No: 825/2024

Between:
Canara Bank. (Rep by its authorized officer, T. Venkata Reddy, Branch Manager, Canara Bank, Main Branch II, Ananthapuramu) **...Plaintiff**
AND
1.G. Nagendra
2.U.Rama Lingaiah **...Defendants**

NOTICE TO THE DEFENDANT NO: 1

D1: G. Nagendra S/o G. Chinna Ramappa,, Residing at D.No. 9/200-A, Gulzarpeta, Ananthapuramu.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 11-12-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.Ramesh Babu,
Advocate, Ananthapuramu,
Cell No: 9398549442

IN THE COURT OF THE IST ADDL.JUNIOR CIVIL JUDGE: ANANTHAPURAMU
O.S. No: 1346/2024

Between:
Canara Bank. (Rep by its authorized officer and Branch Manager, Canara Bank, Sarada Nagar Branch, Anantapuramu) **...Plaintiff**
AND
Shaik Moula Sab **...Defendant**

NOTICE TO DEFENDANT

Shaik Moula Sab S/o Shaik Nannu Sab, residing at D.No. 28-451, Bogi Setty Sangappa street, Ananthapuramu
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 11-12-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.Ramesh Babu,
Advocate, Ananthapuramu,
Cell No: 9398549442

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE: ANANTHAPURAMU
E.A.No.85/2025 in E.P. No.259/2011 in O.S.No.10/1999

Between:
Nara Ramaswamy **...Petitioner/D.Hr**
AND
N. Narayanappa,and Others
...Respondents/ J.Drs

NOTICE TO THE J.DR NO: 8,9 AND 10

J.Dr8: Krishnavenamma, W/o Venugopal
J.Dr9: Bhagyalakshmi, W/o Krishna Murthy
J.Dr10: Savithramma, W/o Chiranjevi,
All are residing at Bhagya Lakshmi Cloth Stores, Near Basavanna Katta, Gandhi Bazar, Old Town, Ananthapuramu.
పై నెంబరు కేసులో J.Drs అయిన మీ హాజరు నిమిత్తము 07-10-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(By order of the court)
H.RAMASUBRAMANYAM
Advocate, Ananthapuramu,
Cell No: 9885734278

IN THE COURT OF THE ADDL.SENIOR CIVIL JUDGE ANANTHAPURAMU
O.S.No:242/2018

Between:
Y.Gopal Reddy **....Plaintiff**
AND
P.Thippa Reddy and Others
...Defendants

NOTICE TO DEFENDENT NO: 3 AND 4

D3: P.Sandeep S/o late P.Thippa Reddy R/of Kaluvapalli Village Beluguppa Mandal Anantapur Dist
D4: P.Shilpa. D/o Late Thippa Reddy, R/of D/NO: 7/925, Rahamat Nagar, Anantapuramu.
పై నెంబరు కేసులో ప్రతివాదులయిన అయిన మీ హాజరు నిమిత్తం 09-10-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన అక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
H.RAMASUBRAMANYAM
Advocate, Ananthapuramu,
Cell No: 9885734278

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE ANANTHAPURAMU
I.A.NO:1919/2025 in A.S NO: Nil/2025

Between:
P.Anuradha **...Petitioner /Appellant**
AND
B. Manjuvani died rep by Lrs..B. Sreenivasa Murthy and others
...Respondants/Plaintiffs/Defendants

NOTICE TO THE RESPONDANT NO:5,9 AND 10

R5: T.Sudhakar Reddy S/o T.Jayarami Reddy,, Business, D.No 14/43, Kamala Nagar, Ananthapuramu Town.
R9: P.Channamma W/o P.Ramappa, D.No.6-331, Ram Nagar, Ananthapuramu Town.
R10: G.Krishna Murthy S/o Late G. Venkanna,, business, D.No.6-2-221, Kovur Nagar, Ananthapuramu
పై నెంబరు కేసులో Respondants అయిన మీ హాజరు నిమిత్తము 24-10-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(By order of the court)
A.Rami Reddy,
G.Ramakishore Reddy
Advocates, Ananthapuramu,
Cell No: 98496 67645

కార్పొరేషన్‌లో లోక్‌కళ్యాణ్ మేళా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని న్యూ కౌన్సిల్ హాల్లో గురువారం లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోక కళ్యాణ్ పథకం ద్వారా వీధి విక్రయదారులు, చిన్న వ్యాపారాలకు అందించే రుణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ నరేష్‌రెడ్డి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, మెప్మా పీడీ విశ్వజ్యోతి, సిటీ మిషన్ మేనేజర్ కాటమయ్య భవాని, సిఒల వ్యాపారులు, పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న అధికారులు

పౌష్టికాహార మాసోత్సవాలు

నార్పల : మండల కేంద్రంలోని 3వ సచివాలయ పరిధిలో ఉన్న ఉయ్యాలకుంటలో పౌష్టికాహార మసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ సిబ్బంది ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా ప్రజలకు స్క్రీనింగ్ ఆరోగ్య పరీక్షలు చేశారు. తర్వాత సిడిపిఒ భారతి చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యామిమభూషణ్, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి, జరీనా, భారతి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని ఎర్రంపల్లి గ్రామంలో పౌష్టికాహార మసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ లక్ష్మీప్రసన్న పోషకాహారంపై మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, సూపర్‌వైజర్, ఆర్డీటీ ఎకాలజీ ఉద్యోగి, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ రామ్మోహన్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేబిస్ నివారణపై అవగాహన

నార్పల : ఎస్‌సిఆర్‌పి ఆధ్వర్యంలో హైపర్ ఇంటర్నేషనల్/పిజిపిఎల్ సహకారంతో గురువారం మండల కేంద్రంలో రేబిస్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దర్షిత, తారబెట్ దినేష్, ప్రాజెక్టు ఆఫీసర్, హసీనా, రైతు నేస్తం రత్నమ్మ, ఎపిఎం, సీసీలు, వీవో లీడర్లు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌పిసిలో ఎస్‌ఆర్‌ఐటికి జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఎన్ఎన్‌విసి 2025లో మండలంలోని రోటరీపురం సమీపంలో ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌ఆర్‌ఐటి)కి జాతీయ గుర్తింపు లభించింది. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యామంత్రిత్వ శాఖ, యుజిసి మద్దతుతో పర్యావరణ సంరక్షణ్ గతివి నిర్వహించిన జాతీయ విద్యార్థుల పర్యావరణ పోటీల్లో ఎస్‌ఆర్‌ఐటి విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనతో దేశంలోని వంద సంస్థల్లో 85వస్థానం దక్కించుకున్నారు. దీనికితోడు ఎస్‌ఆర్‌ఐటిలోని 23 మంది విద్యార్థులు టాప్ వంద విద్యార్థుల జాబితాలోకి ఎక్కారు. వీరి అద్భుతమైన ప్రతిభకు అత్యుత్తమ పనితీరు ఇ-సర్టిఫికెట్‌లు లభించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్‌ఆర్‌ఐటి యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ప్రతిభ కనబరిచిన ఎస్‌ఆర్‌ఐటి విద్యార్థులు

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

నార్పల : ఇటీవల తగ్గించిన జీఎస్టీపై సేల్స్‌టాక్స్ అధికారులు సిటిఒ సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా దుకాణాల వద్దకు వెళ్లి ఏఏ వస్తువులపై జీఎస్టీ తగ్గిందో వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, డిప్యూటీ ఎంపిడిఒ, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

అనంతపురం : ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎ.నారాయణపురం, కామారుపల్లి రైతుసేవా కేంద్రాల పరిధిలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఎ.నారాయణపురంలో 140, కామారుపల్లిలో 140 బ్యాగుల యూరియా పంపిణి చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకటకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు మల్లికార్జున, భాగ్యశ్రీ, రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్రీవిద్య, రేష్మ, టిడిపి నాయకులు భాగ్యరాజు, ఆదినారాయణ, కేశవరెడ్డి, సత్యనారాయణ, రాము, పరశురాం, యల్లప్ప, నారాయణస్వామి, అశోక్, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఎస్‌విజిఎం'లో రెండో విడత అడ్మిషన్లు

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేటి నుంచి 29వ తేదీ వరకూ రెండవ విడత అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హర్షలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులంతా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మెగా రక్తదాన శిబిరం

అనంతపురం : జాతీయ సేవా సమితి దినోత్సవం సందర్భంగా గురువారం నగర సమీపంలో ఉన్న అనంతలక్ష్మి కళాశాలలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బత్తలపల్లి ఆర్డీటీ రక్తనిధి కేంద్రం సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారు 87 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి పండ్లు, పండ్లరసాలు, బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, వైస్ ఛైర్మన్ ఎం.రమేష్‌నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ కుటాల శ్రీనివాసులు, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు ఎం.సురేంద్రనాయుడు, లైబ్రేరియన్ బి.రామాంజనేయులు, కళాశాల జాతీయ సేవా పథకం అధికారి టి.మనోహర్, ఆర్డీటీ రక్తనిధి కేంద్ర బృందం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రేపు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కరుణసాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండల స్థాయి, వివిధ శాఖల అధికారులు, ప్రొటోకాల్ ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాని కోరారు.

మినుముల పంటపై అవగాహన అవసరం

కెవికె ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మల్లేశ్వరి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మినుముల పంట సాగుపై రైతులకు అవగాహన అవసరమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్ఎన్ మల్లీశ్వరి సూచించారు. గార్లదిన్నె మండల కేంద్రంతోపాటు కనుంపల్లి, గుడ్డాలపల్లి, సిరివరం గ్రామాల రైతులకు గురువారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కెవికెలో మినుము పంట సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి కెవికె సేవలు, సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలు, అపరాలలో భాగంగా రైతులకు మినుములో యాజమాన్య పద్ధతులు, కొబ్బరి సంబంధించిన విలువ ఆధారిత పదార్థాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం మినుముల నూతన వంగడం ఎల్‌బిజి 884 విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ కె.సుధారాణి, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త బి.చందన, కెవికె నుంచి చైతన్య, సాయి, విష్ణు, రిడ్స్ ఎన్జీవో సంస్థ నుంచి రాయలసీమ కన్వర్జేన్స్ సంస్థ డైరెక్టర్, ప్రాజెక్ట్ మేనేజర్, రైతులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కెవికె ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మల్లేశ్వరి

మహిళల ఆరోగ్యంతోనే అభివృద్ధి సాధ్యం

జెఎన్‌టియు మహిళా సాధికారత డైరెక్టర్ విబి.చిత్ర

ప్రజాశక్తి-అనంతపురం

మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటే కుటుంబ పరివారం అంతా అభివృద్ధి సాధిస్తుందని జెఎన్‌టియు మహిళా సాధికారిత డైరెక్టర్ విబి చిత్ర అన్నారు. గురువారం స్థానిక జెఎన్‌టియులోని ఒటిపిఆర్‌ఐలో డైరెక్టర్ జివి సుబ్బారెడ్డి నేతృత్వంలో ప్రపంచ ఫార్మాసిస్టు దినోత్సవం, స్వస్తనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమ నిర్వహించారు. ఇందులో భాగంగా స్మార్ట్ విజన్ ఐ ఆసుపత్రికి చెందిన కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ కె.తంకిన్ షాజియా దాదాపు 150 మంది విద్యార్థులు, సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మాసిస్టుల పాత్రను ఎనలేనిదన్నారు. ఫార్మాసిస్టులు, వైద్యులు రోగులకు అనుసంధానకర్తలుగా పని చేస్తూ ఔషధాన్ని సరైన రీతిలో, మోతాదులో వినియోగించి రోగులకు పరిపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తారన్నారు. అనంతరం మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్ ఔషధాల పుట్టుపూర్వోత్తరాల గురించి విశేషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, ఒటిపిఆర్‌ఐ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.లహరి, జెఎన్‌టియు సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన నాయకులు

నార్పల : వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని జిల్లాకే చెందిన పలువురు నాయకులు కలిశారు. ఇందులో భాగంగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల పరిశీలకులు నార్పల సత్యనారాయణరెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే శైలజానాథ్‌తో కలిసి పలు అంశాలపై చర్చించారు. వీరితోపాటు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

జగన్‌కు పూలమొక్క అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి

పుట్లూరు : వైసిపి అధినేత జగన్‌ను గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్‌తో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఇచ్చినందుకు జగన్‌కు పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

జగన్‌కు పూలమొక్క అందజేస్తున్న మహేశ్వరరెడ్డి

యల్లనూరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో యల్లనూరు మండల కన్వీనర్ ఎం.శంకర్, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్‌తో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఇచ్చినందుకు జగన్‌కు పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

జగన్‌కు పూలమొక్క అందజేస్తున్న ఎం.శంకర్

అట్టహాసంగా ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి అర్ఎస్ లోని రైల్వే ఇన్స్టిట్యూట్ క్రీడా మైదానంలో గురువారం అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. గౌతమీపురి ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ, రైల్వే ఇన్స్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రేమ్, సూరి మెమోరియల్ టోర్నమెంట్ ను గుత్తి డీజల్, ఎలక్ట్రికల్ లోకో షెడ్ సీనియర్ డీఎంఈ రమేష్, కమిషనర్ బి.జబ్బార్ మియా, ఎస్ఐ కె.సురేష్, టీడీపీ యువ నాయకులు ఆర్ఎస్ రాజా, బి.రమేష్ లు టాస్ వేసి మ్యాచ్ ను ప్రారంభించారు. మొదటి మ్యాచ్ గుత్తి అర్ఎస్, గుత్తి టౌన్ సినియర్ జట్ల మధ్య జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి కలిసి మెలిసి పెరిగిన స్నేహితులు దూరమవడంతో వారి జ్ఞాపకార్థం స్నేహితులు వారి పేరిట ఫుట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుల కుటుంబ సభ్యులకు సన్మానించారు. న్యాయవాది నవీన్ వ్యాఖ్యాత గా వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నవీన్, రాజా, గిరిబాబు, ప్రశాంత్ (డ్యాడీ), ప్రసాద్, హరినాథ్ రెడ్డి, చిన్న, బాషా, చాంద్, విజయ్ పాల్గొన్నారు.

మ్యాచ్ ప్రారంభానికి టాస్ వేస్తున్న అతిథులు

గుత్తి సిఐగా రామారావు

గుత్తి : నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా రామారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సిఐగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు పుట్టపర్తి స్పెషల్ బ్రాంచ్ సిఐగా బదిలీ అయ్యారు. విఆర్ లో ఉన్న రామారావును ఉన్నతాధికారులు గుత్తి సీఐగా బదిలీ చేశారు. దీంతో ఆయన ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నూతన సిఐకు ఎస్ఐలు సురేష్, నాగప్ప, గౌతమ్ అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

వైసిపి యువనేత అనుమానాస్పద మృతి

పామిడి : మండలంలోని జి.కొట్టాల గ్రామానికి చెందిన వైసిపి రూరల్ బూత్ కన్వీనర్ దేవన సతీష్‌రెడ్డి (33) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సతీష్‌రెడ్డి బుధవారం రాత్రి పామిడి నుంచి గ్రామం జి.కొట్టాలకు బైక్‌లో వెళుండగా కాలాపురం గ్రామ సమీపంలో తన మోటర్ సైకిల్‌పై నుంచి రోడ్డుపై పడి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఒంటిపై గాయాలు ఉండడంతో మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పామిడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా సతీష్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలోనే గాయపడి మరణించినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు తదుపరి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఇన్‌సెట్‌లో సతీష్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే నివాళి

సతీష్‌రెడ్డి మృతి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకట రామిరెడ్డి జి.కొట్టాల గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సతీష్‌రెడ్డి మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో వైసిపి నాయకులు చెన్నకేశవరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సాకే ఓబులేసు, తదితరులు ఉన్నారు.